క్లుప్తంగా

పాఠశాల తనిఖీ

ఉదయగిరి: స్థానిక బీసీ కాలనీ తెలుగు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ తోట శ్రీనివాసులు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను ఆరాతీశారు. సెలవుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతి ప్రదానం



ఆత్మకూరురూరల్: మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మండలంలోని బండారుపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు కెనరా బ్యాంక్ మేనేజర్ వెంకటేష్, ప్రధానోపాధ్యాయుడు పెంచలయ్య, టీచర్లు ఇందూరు చంద్రమోహన్‌రెడ్డి, రామిరెడ్డి రామసుబ్బారెడ్డి, పూజారి మధుసూదన్, బ్యాంకు సిబ్బంది నవీన్ పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం

ఉదయగిరి: విజయవాడ వరద బాధితుల సాయం కోసం మండలంలోని పుల్లాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో తిరిగి రూ.5,267 నగదు సేకరించారు. దీనిని ప్రధానోపాధ్యాయుడు గాజులపల్లి సుబ్బారెడ్డికి మంగళవారం అందజేశారు. ఉపాధ్యాయులు మరికొంత నగదు కలిపి రూ.10 వేలను సీఎం సహాయనిధికి పంపనున్నారు. కార్యక్రమంలో బోడబండ పాఠశాల హెచ్ఎం షేక్ ఖాదర్‌బాషా, టీచర్లు ఆదిలక్ష్మీదేవి, ప్రశాంతకుమారి పాల్గొన్నారు.

31 మద్యం బాటిళ్ల స్వాధీనం

జలదంకి: మండల కేంద్రమైన జలదంకిలో మోతుపల్లి కోటయ్య అనే వ్యక్తి నుంచి 31 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై లతీఫున్నీసా మంగళవారం తెలిపారు. కోటయ్య ఇంటి వద్ద బాటిళ్లను నిల్వ ఉంచి అధిక ధరలకు విక్రయిస్తున్నాడనే సమాచారంతో దాడులు చేశామన్నారు. అతడిపై కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

జవహర్ భారతిలో ఓరియంటేషన్ ప్రోగ్రాం

కావలి: పట్టణంలోని జవహర్ భారతి డిగ్రీ కళాశాలలో 2024 – 2025 విద్యా సంవత్సరానికి సంధించి ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు మంళవారం ఓరియంటేషన్ ప్రోగ్రాంను కళాశాల ఆవరణలోని శంకరన్ సెమినార్ హాల్లో నిర్వహించారు. దీనికి ప్రిన్సిపల్ డా.పి.సుబ్రహ్మణ్యం నాయుడు అధ్యక్షత వహించారు. స్వయం ఉపాధి కోర్సుల సంచాలకుడు డాక్టర్ ఆర్.మాల్యాద్రి పలు విషయాలను వెల్లడించారు.

బీచ్‌లో స్వచ్ఛత హీ సేవ



కావలి: స్వచ్ఛత హీ సేవలో భాగంగా స్థానిక విక్రమ్ సింహపురి యూనివర్సిటీ స్నాతకోత్సవ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం తుమ్మలపెంట బీచ్‌ను శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. నెల్లూరు నెహ్రూ యువ కేంద్రం, ఒట్టూరు మోడల్ స్కూల్ భాగస్వామ్యంతో బీచ్‌లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరివేసి ట్రాక్టర్ల ద్వారా తరలించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సుశీల నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో గాంధీ జయంతి

ఆత్మకూరు: పట్టణంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ముందస్తుగా మహాత్మా గాంధీ జయంతిని మంగళవారం నిర్వహించారు. గాంధీ వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు.

ఆర్థిక సాయం అందజేత



ఆత్మకూరు: సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి మంగళవారం పలు కుటుంబాలకు ఆర్థిక సాయం చేశారు. ఒకటో వార్డుకు చెందిన నాగినేని వెంకటేశ్వర్లు, 14వ వార్డుకు చెందిన గోగుల పెద మాలకొండయ్య, 15వ వార్డుకు చెందిన కొమరగిరి చెంచయ్య, 23వ వార్డుకు చెందిన షేక్ అబ్దుల్ కరీం ఇటీవల మృతిచెందారు. దీంతో బాధిత కుటుంబాలను పరమేశ్వరరెడ్డి పరామర్శించి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ నిర్వాహకులు సోమవరపు యానాదిరెడ్డి, రాంపల్లి ప్రసాద్ రెడ్డి, అచ్చోలు పెంచలరెడ్డి పాల్గొన్నారు.

పండ్ల ధరలు పైపైకి..

బలవర్థకమైన ఆహారంగా పేరున్న పండ్లకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది. ఆయా సీజన్లలో దొరికే పండ్లు ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుస్తాయన్న విషయం తెలిసిందే. ఒక ప్రాంతంలో పండినవి మరో ప్రాంతానికి సరఫరా కావడం, అన్ని రకాలను పెద్ద దుకాణాల్లో విక్రయించడం సాధారణంగా జరిగేదే. కానీ ప్రస్తుత ధరలు చూసి చాలా మంది కొనుగోలు చేసేందుకు జంకుతున్న పరిస్థితులున్నాయి. పదిరోజుల వ్యవధిలో పండ్ల రేట్లు కొండెక్కాయి.

- పదిరోజుల వ్యవధిలో 20 శాతం పెరుగుదల
- కొనేందుకు జంకుతున్న ప్రజలు
- పెరిగిన రవాణా చార్జీలు
- అనుకూలంగా లేని వాతావరణం





ఆత్మకూరు: పట్టణంలో సుమారు 40కిపైగా పండ్ల విక్రయ షాపులున్నాయి. దుకాణదారులు కొన్ని రకాలను నెల్లూరు నుంచి, మరికొన్ని రకాలను రాజంపేట నుంచి తెస్తుంటారు. పలువురు పెద్ద దుకాణదారులు నెల్లూరులో హోల్‌సేల్ విక్రయదారులతో కలిసి దానిమ్మ, యాపిల్, ద్రాక్ష, కమల, తదితర పండ్లను షోలాపూర్, చండీగఢ్, నాగపూర్ తదితర దూర ప్రాంతాల నుంచి తీసుకొని రావడం జరుగుతోంది. ఇటీవల రవాణా చార్జీలు పెరగడంతో పండ్ల ధరలకు రెక్కలొచ్చాయని దుకాణదారులు చెబుతున్నారు. అరటి పండ్లను రాజంపేట, వింజమూరుల నుంచి హోల్‌సేల్ షాపుల నిర్వాహకులు తీసుకొస్తుండగా చిన్న దుకాణదారులు స్థానికంగా ఉన్న మండీ నుంచి కొనుగోలు చేస్తుంటారు. 20 కేజీలున్న ఒక్కో బాక్స్‌కు రూ.50 రవాణా చార్జీ చెల్లించి తీసుకుంటామని వారు వెల్లడిస్తున్నారు. పోషక పదార్థాలు అధికంగా ఉన్న డ్రాగన్ ఫ్రూట్‌కు ప్రస్తుతం డిమాండ్ ఉన్నట్లు హోల్‌సేల్ దుకాణదారులు అంటున్నారు.

ధరలిలా..

పండ్లు	గత వారం ధర (కేజీ రూ.)	ఈ వారం ధర (రూ.)
డ్రాగన్ ఫ్రూట్	180	200
యాపిల్ ఒకటో రకం	200	250
యాపిల్ రెండో రకం	125	150
దానిమ్మ	220	250
ద్రాక్ష రెండు రకాలు	80	100
అనాస	100	100
కమల ఒకటో రకం	70	100
కమల రెండో రకం	40	50
బత్తాయి ఒకటో రకం	50	75
బత్తాయి రెండో రకం	40	50
అరటి పండ్లు (డజన్)	50	60

అందుకే..

పండ్ల ధరలు పెరగడానికి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో అననుకూల వాతావరణం ఓ కారణమని దుకాణాదారులు తెలిపారు. కొన్నిచోట్ల అధిక వర్షాలు, మరికొన్ని చోట్ల అధిక ఉష్ణోగ్రతలతో పండ్ల తోటలు దెబ్బతిన్నాయయి. బొప్పాయి, అనాస, అరటి, బత్తాయి తదితర వాటికి డిమాండ్ ఏర్పడినట్లు తెలుస్తోంది.

ఆ ప్రభావం

గతంతో పోలిస్తే రైళ్లలో రవాణా చార్జీలు కొంత మేర పెరగడంతో ఆ భారం హోల్‌సేల్ దుకాణదారులపై పడిందని దీంతో పండ్ల ధరలు పెంచారని స్థానిక షాపులు వెల్లడిస్తున్నారు. లారీ, డీసీఎం తదితర వాహనదారులు రవాణా చార్జీలు పెంచడం ఒక కారణంగా తెలుస్తోంది. పది రోజుల వ్యవధిలో 18 నుంచి 20 శాతం ధరలు పెరిగాయి. ధరల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వినియోగదారులు కోరుతున్నారు.

నష్టం భరించాల్సిందే..



కొద్దిరోజులుగా పండ్ల ధరలు కొంత మేర పెరిగాయి. కొనుగోలుదారులు ఇంత పెరిగాయా అంటున్నా ఎలాగోలా ఒప్పించి విక్రయిస్తున్నాం. కొన్ని రకాల పండ్లు ఎక్కువ రోజులు అమ్ముడుపోక చెడిపోతుంటాయి. ఆ నష్టం భరించక తప్పదు. కొనుగోలుదారులకు మంచి పండ్లు విక్రయించేందుకు ధర ఎక్కువైనా నాణ్యమైన సరుకు తెస్తుంటాం.

– షేక్ సుల్తాన్, పండ్ల వ్యాపారి, ఆత్మకూరు

ఘన సన్మానం

సంఘం: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఈఓపీఆర్డీ అప్పాజీ బదిలీ అయ్యారు. ఆయన్ను మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది ఘన సన్మానించారు.

డీసీపల్లి వాసికి గౌరవ డాక్టరేట్



మధుసూదనశాస్త్రి

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లికి చెందిన పురోహితుడు బ్రహ్మశ్రీ చింతలపల్లి వసంత మధుసూదనశాస్త్రికి గౌరవ డాక్టరేట్ లభించింది. ఇటీవల హైదరాబాద్ తెలంగాణ సరస్వతి పరిషత్‌లో జరిగిన కార్యక్రమంలో ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ అండ్ రీసెర్చ్ యూనివర్సిటీ వారు సేవా రంగంలో గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చారని మంగళవారం మధుసూదనశాస్త్రి వెల్లడించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

చేజర్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నిర్వహించిన అండర్–14 బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో చేజర్ల జిల్లా పరిషత్ హైస్కూల్ 9వ తరగతి విద్యార్థి తోడేటి రమణయ్య ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడని పీడీ పి.మల్లికార్జునరావు తెలిపారు. మంగళవారం పాఠశాలలో రమణయ్యను హెచ్ఎం హైమావతి, టీచర్లు అభినందించారు.

ఆరోపణలు సరికాదు

జలదంకి: జలదంకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదని కొందరు ఆరోపణలు చేస్తున్నారని, ఇది సరికాదని డాక్టర్ ఎ.శ్రీనివాసులు పేర్కొన్నారు. మంగళవారం ఆయన పీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడారు. వైద్యశాలకు గర్భిణులు, ఇతర పేషెంట్లు వస్తుంటారని, అందువల్ల ఫ్రీజర్ బాక్స్‌ను తీసివేయాలని చెప్పామన్నారు. ఆ బాక్స్‌ను అక్కడ పెట్టిన వారు కక్ష పెంచుకుని డాక్టర్, సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించడంలేదని అసత్య ఆరోపణలు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే సురేష్ ఆస్పత్రిని తనిఖీ చేసి సక్రమంగా విధులు నిర్వహిస్తున్నామని తెలియజేశామన్నారు. జలదంకి గ్రామానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ విధులు సక్రమంగా నిర్వహించకపోవడంతో డీఎంహెచ్‌ఓకు సరెండర్ చేశామన్నారు. సమావేశంలో సీహెచ్ఓ సోమేశ్వరరావు, హెల్త్ ఎడ్యుకేటర్ హరిప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన అధికారులు


హేమంత్ కుమార్


మస్తానయ్య, డీటీ


నాగూర్‌వలీ, ఈఓపీఆర్డీ


వెంటేశ్వర్లు, ఏఈ

చేజర్ల: మండల డిప్యూటీ తహసీల్దార్‌గా ఆర్.మస్తానయ్య స్థానిక కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

- వరికుంటపాడు: మండల ఈఓపీఆర్డీగా షేక్ నాగూర్‌వలీ మంగళవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఇంకా మండల తహసీల్దార్‌గా హేమంత్ కుమార్ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.
- అల్లూరు: మండలం హౌసింగ్ ఏఈగా సీహెచ్ వెంకటేశ్వర్లు మంగళవారం అల్లూరులోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జిగా ఉన్న కిరణ్ నార్త్‌ములూరు ఇంజినీరింగ్ అసిస్టెంట్‌గా తన స్థానానికి వెళ్లాడు.


గౌస్‌మొహిద్దీన్, ఏఈ

- సంగం: మండల గృహ నిర్మాణ శాఖ ఏఈగా గౌస్‌మొహిద్దీన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.

చిల్లర విమర్శలు చేస్తే సహించం

- వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వీరరఘు

బిట్రగుంట: బోగోలులోని టీడీపీ నాయకులు అధికార మదంతో చిల్లర విమర్శలు, అర్థం లేని ఆరోపణలు చేస్తే సహించేది లేదని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు అన్నారు. బోగోలులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధానంగా ఆ పార్టీకి చెందిన చిలకపాటి వెంకటేశ్వర్లు తనపై చేసిన అసత్య ఆరోపణలను ఆధారాలతో సహా నిరూపించాలని సవాల్ చేశారు. 2020–23 మధ్య కాలంలో నాగులవరం సింగిల్ విండో అధ్యక్షుడిగా తాను పనిచేసిన కాలంలో రూ.70 లక్షల వరకూ అవినీతికి పాల్పడ్డానని ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సొసైటీకి ఎవరూ సాధించని విధంగా సుమారు రూ.80 లక్షల వరకూ ఆదాయం సమకూర్చినట్లు వివరించారు. అనుచరులతో గ్రావెల్ తరలించినట్లు, కప్పరాళ్లతిప్పలోని తహసీల్దార్ కార్యాలయం వెనుక 28 ఎకరాలను బినామీలకు ఇప్పించుకుని రూ.10 లక్షలు సంపాదించుకున్నట్లు చేసిన ఆరోపణలను ఆధారాలతో సహా నిరూపించాలని సవాల్ చేశారు. టీడీపీ నాయకులు చేసిన ఆరోపణల్లో ఒక్క శాతమైనా నిజం ఉంటే బోగోలులోని విజయ గణపతి ఆలయంలో ప్రమాణం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వారికి చిత్తశుద్ధి ఉంటే బోగోలులోని గంగమ్మతల్లి ఆలయానికి చెందిన గంగమాన్యం ఎవరి చేతుల్లో ఉందో వెలికితీయాలన్నారు. సమావేశంలో నాయకులు మేకల శ్రీనివాసులు, ఉప్పాల మాచర్ల, తుమ్మల రమణయ్య నాయుడు, నాయబ్ రసూల్, సూరపనేని శ్రీనివాసులు, షేక్ నవాజ్, పోతల ప్రసాద్, కిరణ్ కుమార్, సుందర్‌రాజు, గంగపట్ల పాపయ్య, గోపిశెట్టి వెంకయ్య, రాపూరు వెంకటేశ్వర్లురెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వీరరఘు

వృద్ధురాలిని బురిడీ కొట్టించి..

- నగదు కాజేసిన కేటుగాళ్లు

సంగం: బ్యాంక్‌లో పొదుపు ద్వారా తీసుకున్న నగదును లెక్కపెట్టిస్తామని ఓ వృద్ధురాలిని ఇద్దరు వ్యక్తులు బురిడీ కొట్టించారు. ఆమె నగదు కాజేసిన ఘటన సంగం సిండికేట్ బ్యాంక్ వద్ద మంగళవారం జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. తరుణవాయి పంచాయతీ మజరా దాసరిపాళెం గ్రామానికి చెందిన సుగుణమ్మ అనే వృద్ధురాలు ఓ పొదుపు గ్రూపులో సభ్యురాలిగా ఉంది. ఈ క్రమంలో తనకు వచ్చిన రుణాన్ని తీసుకునేందుకు సంగం సిండికేట్ బ్యాంక్‌కు వెళ్లింది. రూ.50 వేలను పొందింది. అదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వృద్ధురాలి అమాయకత్వాన్ని పసిగట్టి డబ్బును లెక్కపెట్టిస్తామని చెప్పారు. రూ.16 వేలు పక్కన పెట్టి మిగిలిన నగదు ఆమెకిచ్చి ఉడాయించారు. సుగుణమ్మ కొంతసేపటి తర్వాత వేరే వారితో లెక్క పెట్టించగా రూ.16 వేలు తగ్గడంతో కన్నీరుమున్నీరైంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు అందలేదు.



సుగుణమ్మ

కాకాణిని కలిసిన నాయకులు

సోమశిల: వైఎస్సార్‌సీపీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని మంగళవారం అనంతసాగరం మండలం శంకరనగరం గ్రామానికి చెందిన నాయకులు పార్లపల్లి రవికుమార్‌రెడ్డి, నాగా సునీల్‌కుమార్‌రెడ్డి, తేజ తదితరులు నెల్లూరులో మర్యాదపూర్వకంగా కలిశారు. గ్రామానికి సంబంధించిన సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.



గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది'

సాక్షి నెటవర్క్: ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల్లోని గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహించారు. సాగులో ఉన్న పంటలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పరిశీలించారు. రైతులకు సూచనలిచ్చారు.



కొండాయపాళెంలో వరిపంట పరిశీలన

చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో ప్రతిభ

ఆత్మకూరు: ఇటీవల జేవీవీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో జరిగిన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభ చూపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం వారికి నగదు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానంలో వాశిలి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు, ద్వితీయ స్థానంలో మహిమలూరు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు నిలిచారు. ప్రైవేట్ పాఠశాలల నుంచి గాయత్రి ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ప్రముఖ డాక్టర్ షకీల బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జేవీవీ కార్యవర్గ సభ్యులు వంటేరు మల్లికార్జున, మురళీకృష్ణ, హెచ్ఎం అనంతలక్ష్మి, రెడ్‌క్రాస్ కార్యవర్గ సభ్యుడు సాధిక్ హుస్సేన్, ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు రామ్మోహన్‌రెడ్డి, టీసీ సుబ్బయ్య, అమరావతి పాల్గొన్నారు.

- సంగం: సంగం జెడ్పీ హైస్కూల్లో ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. సంగం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు మొదటి స్థానం, మర్రిపాడు స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం, దువ్వూరు విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచారు. ఎంఈఓ జానకిరాం బహుమతులు ప్రదానం చేశారు.
- చేజర్ల: చేజర్ల జిల్లా పరిషత్ హైస్కూల్లో చెకుమకి టాలెంట్ టెస్ట్‌ను మంగళవారం నిర్వహించారు. చేజర్ల హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థిని ఎస్‌కే యాస్మిన్, 9వ తరగతి నుంచి వై.స్వర్ణ, 8వ తరగతి నుంచి డి.కామాక్షి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. వారిని హెచ్ఎం హైమావతి అభినందించారు.



సంగం: విద్యార్థులకు బహుమతి అందజేత

- సోమశిల: చెకుముకి టాలెంట్ టెస్ట్ మంగళవారం అనంతసాగరం మండల కేంద్రంలోని టీజేఎస్ జెడ్పీ హైస్కూల్లో జరిగింది. ప్రభుత్వ విభాగంలో సోమశిల ఉన్నత పాఠశాల విద్యార్థులు, ప్రైవేట్ విభాగంలో శాంతినికేతన్ పాఠశాల విద్యార్థులు ప్రథమ బహుమతి సాధించి జిల్లాస్థాయికి ఎంపికయ్యారు. పాపిశెట్టి నరసింహులు దాతగా వ్యవహరించారు. ఎంఈఓ–2 కాటంరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వేము పెంచలయ్య, గ్రంథాలయాధికారి డి.నారాయణ పాల్గొన్నారు.

కుమార్తెపై తండ్రి లైంగికదాడి

చేజర్ల: కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రి కన్న కూతురిపై లైంగికదాడి చేసిన ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తి తన కుమార్తెపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయంపై బాధితురాలు, ఆమె తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిని అరెస్ట్ చేశారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం

ఆత్మకూరు: అనుమతి లేకుండా బొగ్గేరు నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఆత్మకూరు ఎస్సై షేక్ జిలానీ తెలిపారు. మంగళవారం తెల్లవారుజామున మండలంలోని గండ్లవేడు మార్గంలో ట్రాక్టర్ ఇసుకను తీసుకెళ్తోంది. దానికి అనుమతి లేదని కేసు నమోదు చేసి స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

- మర్రిపాడు: మండలంలోని భీమవరం సమీపంలోని బొగ్గేరు వాగు నుంచి ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు. కేసు నమోదు చేశామన్నారు.

సచివాలయ సిబ్బందికి సూచనలు

వరికుంటపాడు: మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జున మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. స్వర్ణాంధ్ర 2047 దార్శనికపత్రంలోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడంలో ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఆయన అన్నారు.

విద్యార్థుల రక్తదానం

కావలి: జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని శ్రీచైతన్య డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ పీవీ సాయితేజ ఆధ్వర్యంలో 25 మంది రక్తదానం చేశారు. సాయితేజ 15వ సారి రక్తదానం చేసి ఆదర్శంగా నిలిచాడు. విద్యార్థులను రెడ్‌క్రాస్ చైర్మన్ డి.రవిప్రకాష్, కళాశాల డైరెక్టర్ జానకిరామ్ అభినందించారు.

- బాల్యం నుండే రక్తదానంపై అవగాహన కలిగి ఉండాలని టీమ్ సేవియర్స్ సభ్యులు, రక్తదాన మోటివేటర్స్ జగదీశ్, జయంత్‌లు పేర్కొన్నారు. స్థానిక 8వ వార్డు మున్సిపల్ హైస్కూల్లో ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు చేశారు. టీమ్ సభ్యులు రక్తదానంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుజాత, ఎన్‌సీసీ అధికారి కేబీ కిరణ్ కుమార్, వ్యాయమ ఉపాధ్యాయుడు ఎం.జనార్దనరెడ్డి, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పరీక్ష కేంద్రాల పరిశీలన

కావలి: ఈనెల 3వ తేదీ నుంచి జరిగే ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్–2024)కు సంబంధించిన కావలిలోని పరీక్ష కేంద్రాలైన పీబీఆర్ ఇంజనీరింగ్ కాలేజ్, ఆర్ఎస్ఆర్ ఇంజినీరింగ్ కాలేజ్‌లను రాష్ట్ర పరిశీలకుడు, ఏపీ ఓపెన్ స్కూల్ డైరెక్టర్ నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. అభ్యర్థులకు వసతులు కల్పించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఈఓలున్నారు.



వివరాలు తెలుసుకుంటున్న పరిశీలకుడు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

చేజర్ల: తమిళనాడు రాష్ట్రం మధురైలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని బోడిపాడు గ్రామానికి చెందిన నాగిరెడ్డి చందు మృతిచెందాడు. నాగిరెడ్డి చెంచురామిరెడ్డి కుమారుడైన చందు మధురైలో బీటెక్ చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో చందు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ చనిపోవడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

ఆశా కార్యకర్త తొలగింపుపై విచారణ

- అడ్డుకున్న సర్పంచ్, ఆయన వర్గీయులు

కలిగిరి: మండలంలోని ఆశా కార్యకర్త విజయమ్మ తొలగింపు విషయంలో విచారణ చేసేందుకు డీఎంహెచ్ఓ పెంచలయ్య మంగళవారం కలిగిరికి విచ్చేశారు. తొలుత స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు బిజ్జం గీతారెడ్డి, సునీల్‌కుమార్ వైద్యసిబ్బందితో మాట్లాడి విజయమ్మ పనితీరు గురించి వివరాలు నమోదు చేసుకున్నారు. అనంతరం రావులకొల్లు గ్రామానికి వెళ్లి స్థానికులతో మాట్లాడారు. విచారణ జరుగుతున్న నేపథ్యంలో ఆశా వర్కర్స్ జిల్లా యూనియన్ అధ్యక్షురాలు విజయలక్ష్మి, పలువురు సీఐటీయూ నాయకులు అక్కడికి చేరుకున్నారు. కాగా మా గ్రామంలో మీకేం పని అంటూ టీడీపీకి చెందిన సర్పంచ్ పూసల వెంగపనాయుడు, అతని వర్గీయులు ఆశా కార్యకర్తలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా నాయకులు మాట్లాడుతూ రాజకీయ కారణాలతో దళిత మహిళలను వేధించడం తగదన్నారు. చిరుద్యోగులపై కక్షసాధింపులు మానుకోవాలన్నారు. విజయమ్మకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేదిలేదన్నారు. డీఎంహెచ్ఓ మాట్లాడుతూ నివేదికను కలెక్టర్‌కు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. కలిగిరిలో విచారణ జరుపుతున్న సమయంలో విజయమ్మ స్వల్ప అస్వస్థతకు గురి కావడంతో ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది వైద్యసేవలందించారు.



ఆశా కార్యకర్తలతో వాదనకు దిగిన సర్పంచ్ వెంగపనాయుడు తదితరులు

- ఆత్మకూరు: డీఎంహెచ్ఓ రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి పందిటి విజయమ్మ అనే ఆశా కార్యకర్తను విధుల నుంచి తొలగించడం దారుణమని, వెంటనే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. అధికారి తీరు సరికాదని నినాదాలు చేస్తూ పట్టణంలోని యూపీహెచ్‌సీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో పలువురు కార్యకర్తలు మాట్లాడుతూ కలిగిరి మండలంలోని రావులకొల్లు గ్రామంలో విజయమ్మ 18 సంవత్సరాలుగా ఆశా కార్యకర్తగా పనిచేస్తోందన్నారు. ఆమెను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యవర్గ సభ్యుడు ఎం.హజరత్తయ్య, ఆశా కార్యకర్తలు విజయలక్ష్మి, షాహీనా, సుజాత, పద్మమ్మ, అనిత, మస్తానమ్మ తదితరులు పాల్గొన్నారు.